
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 25 జనవరి 2023

5

కాకినాడ



తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రాంథిక భాషలో ఉన్న తెలుగుదనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్ని, విలువను తెలియజేసిన గిడుగు వెంకట రామమూర్తి భాషోద్యమ పితామహుడని ప్రముఖ సాహిత్య వేత్త డాక్టర్ శిరీష పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాషలో సాగి అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, బుద్దరాజు సత్యనారాయణ రాజు, పెండెం శ్రీదేవి, రేలంగి బాపిరాజు, సిహెచ్.వెంకట్రావు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

సిఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం



అధికారులతో మాట్లాడుతున్న అజయ్ కల్లాం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పారదర్శకంగా భూముల రీ సర్వేను నిర్వహించాలని సిఎం ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం అన్నారు. భూముల రీ సర్వే పురోగతి భవిష్యత్తు కార్యాచరణపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, ఏలూరు జిల్లా కలెక్టర్లు, జెసిలు, సర్వే రెవెన్యూ, సచివాలయ అధికారులు, స్పెషల్ సిఎస్ పి.సాయిప్రసాద్, సిసిఎల్ఎ కమిషనర్ సిద్ధార్థ జైన్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అజయ్ కల్లాం మాట్లాడుతూ భూముల సమగ్ర రీసర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం అన్నారు. భూముల రీ సర్వే ప్రక్రియలో నిర్దిష్ట కాలపరిమితిలో ఫేజ్ విధానంలో 2 వేల గ్రామాలు చొప్పున రీ సర్వే పనులను చేపట్టి పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2 వేల గ్రామాల్లో సర్వే పూర్తి అయ్యిందన్నారు. వీటికి సంబంధించి జగనన్న భూహక్కు పత్రాలను ఫిబ్రవరి నెలాఖరు నాటికి పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఫేజ్ -2 విధానంలో మరో 2 వేల గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియను నిర్వహించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి వచ్చే అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కారం చేయాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిష్కారం సమయంలో రికార్డులు పరిశీలన కాకుండా వాస్తవ భూ యజమానులతో వాస్తవ స్థితిని నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఇందుకోసం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని ఆదేశించారు. 2023 డిసెంబరు నాటికి రీసర్వే పనులను పూర్తి చేసి భూ యజమానులకు భరోసా కల్పించి భూహక్కు పత్రాలను అందించాలన్నారు. ఈ సర్వే ద్వారా భవిష్యత్తులో సివిల్ తగాదాలు కూడా ఉత్పన్నమయ్యే అవకాశం లేదని ఆయన తెలిపారు. సిసిఎల్ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ మాట్లాడుతూ రీసర్వే సమయంలో సమగ్రంగా రికార్డులను తనిఖీ చేయాలన్నారు. క్షేత్రస్థాయి తనిఖీల సందర్భంలో పర్యవేక్షణ బాధ్యతలను నిబద్ధతతో పాటించాలన్నారు. పర్యవేక్షణ సమయంలో ఎటువంటి అలసత్వం చూపరాదన్నారు. సిసిఎల్ఎ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ మరింత త్వరితగతిన రీ సర్వే పూర్తి చేసేందుకు అధికారులకు వచ్చే సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొనే దిశలో టెలికాన్ఫరెన్స్ పరికరాలను సర్వే శాఖ ద్వారా అందించామన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, జెసి ఇలాక్కియా మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో 413 గ్రామ పంచాయతీల పరిధిలో ఫేజ్ -1 లో 207 గ్రామాలకు గాను 128 గ్రామాల్లో రీ సర్వే పనులు పూర్తి చేశామన్నారు. 49,658 జెబిహెచ్ పట్టాలకు 46,223 పంపిణీ చేశామన్నారు. మ్యూటేషన్‌కు సంబంధించి 110 అర్జీలు పరిష్కరించామన్నారు. రీ సర్వేతదుపరి క్లరికల్ తప్పిదాలకు సంబంధించి 120 పాత సర్వే నెంబర్లలో తప్పులను పూర్తిగా పరిష్కరించామన్నారు.

ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కాజులూరు, తాళ్లరేవు


కాజులూరులో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆలిండియా రైతు సంఘాల సమన్వయ ఈనెల 26న తలపెట్టిన దేశవ్యాప్త ట్రాక్టర్ల ర్యాలీ జయప్రదం చేయాలని పలువురు సంఘం నాయకులు పిలుపు ఇచ్చారు. ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కాజులూరు వేగుళ్లమ్మ గుడి వద్ద నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడారు. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సంవత్సరం పాటు ఢిల్లీ సరిహద్దున ఆందోళన చేసిన కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి రైతులకు క్షమాపణ చెప్పి రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేసిందన్నారు. మద్దతు ధరలు గ్యారంటీ చట్టాన్ని అమలు చేస్తామని వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు అమలు చేస్తామని ఎరువులు పురుగుమందులు రేట్లు రైతులకు అందుబాటు ధరలో ఇస్తామని ఇలా అనేక హామీలు ఇచ్చి దీక్ష విరమింపజేసి సంవత్సరం కావస్తున్నా నేటికీ ఈ హామీలన్నీ అమలు జరగలేదన్నారు. దీంతో దేశవ్యాప్తంగా 500 రైతు సంఘాలు ఈనెల 26న ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించాలని అఖిల భారత రైతు సంఘాలు పిలుపు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుపూడి భూచక్రం, నామ చంద్రరావు, వనుం వీరభద్రం, జక్కీ శ్రీనివాసు, కట్ట సత్యనారాయణ పాల్గొన్నారు. తాళ్లరేవు మండలంలోని ప్రజా సంఘాల భవనం వద్ద పాలెపు ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుత్తుల సూర్యనారాయణ, కుక్రిమెట్ల సత్తిరాజు, నామ శ్రీనివాసు, పలివెల ఏడుకొండలు, గుత్తుల వెంకటరెడ్డి, వాసంశెట్టి సత్తిబాబు, దడాల అబ్బులు దడాల వెంకటరమణ, మేడిశెట్టి ఏడుకొండలు, కౌలు రైతులు పాల్గొన్నారు.

చంద్రమాంపల్లిలో నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం


పోటీలను ప్రారంభిస్తున్న రమణారెడ్డి

చంద్రమాంపల్లి (దివిలి) గ్రామంలో స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికి పోటీలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలను జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ ఎ.రమణారెడ్డి, చంద్రమాంపల్లి సర్పంచ్ కురుమెళ్ల లోవరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సూపర్ స్టార్ కృష్ణ కళా ప్రాంగణంలో అప్పిరెడ్డి వెంకట సూర్యనారాయణ రెడ్డి కళావేదికపై జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కళా రంగం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావలసిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సభలో ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, సిఎస్.మూర్తి, స్నేహ ఆర్ట్స్ అధ్యక్షులు గొందేశి రాజా, కార్యదర్శి ఇందన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగు, గొందేశి సత్యానందం, వెన్న సత్యనారాయణ, పాలాని సత్తిబాబు, నూకలమంతి నానాజీ, పాల్గొన్నారు. మొదటి రోజు ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.


నాటికలోని ఒక సన్నివేశం

కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి - యానాం


కార్మికులతో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

రుంగ్త ఇరిగేషన్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో కార్మికులందరికీ కనీస సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మికులతో కలిసి ఫ్యాక్టరీ మేనేజర్ రవిశంకర్ బెహరకు డిమాండ్ నోటీసు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడారు. యానాంలోని అడవిపోలంలో ఉన్న రుంగ్త ఇరిగేషన్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో 100 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. 20ఏళ్ల సర్వీస్ ఉన్నా వేతనాలు మాత్రం అరకొరగానే ఉన్నాయన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇక్కడ అమలు కావట్లేదన్నారు. ఇంక్రిమెంట్, బోనస్‌లను తగ్గించి ఇస్తున్నారని తెలిపారు. ఒకపక్క ధరలు ఆకాశాన్నంటుతున్నా ఇంక్రిమెంట్, బోనస్ పెంచాల్సిందిపోయి తగ్గించడం బాధాకరమన్నారు. కరోనా సమయంలోనూ కార్మికులు పనిచేసి ఫ్యాక్టరీ అభివృద్ధికి కృషి చేశారన్నారు. కాని యాజమాన్యం మాత్రం కార్మికులను పట్టించుకోవట్లేదన్నారు. ఫ్యాక్టరీలో నూతనంగా చేరిన కార్మికుల నుంచి రూ.10వేలు చొప్పున కట్టించుకున్నారన్నారు. మూడేళ్ల వరకూ కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వలేదన్నారు. వారికి ఏం జరిగినా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కుంచే సత్యనారాయణ, ఇళ్ల శ్రీనివాస్ కార్మికులు యు.నాగేశ్వరరావు, సిహెచ్. సూర్యనారాయణ, ఎన్.రాజబాబు, పి.సుధీర్, పి.వెంకటరమణ, పి.ఈశ్వరరావు, ఎస్.సోమరాజు, వివిబి.వర్మ, ఎ.శ్రీనివాస్‌రావు, బి.సతీష్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా పల్లంరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

కేంద్ర రక్షణ శాఖ మాజీ మంత్రి ఎంఎం.పల్లంరాజు పుట్టినరోజు వేడుకలు ఏలేశ్వరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎపిసిసి సభ్యుడు ఉమ్మిడి వెంకట్రావు కార్యాలయంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురపు బాబి, పోతాబత్తుల పెదబాబు, ఉమ్మిడి సురేష్ కార్యకర్తలు ఉన్నారు.

ఓటర్ల చైతన్యంతో ప్రజాస్వామ్య విజయం

ప్రజాశక్తి-కాకినాడ

ఓటర్ల చైతన్యంతో, జాగరూకతతో వ్యవహరించినప్పుడే భారత ప్రజాస్వామ్యం పరిమళిస్తుందని జెఎన్‌టియుకె ప్రొఫెసర్, జన విజ్ఞాన వేదిక కాకినాడ నగర అధ్యక్షులు డాక్టర్ ఆలపాటి శ్రీనివాసరావు అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం పిఆర్ ప్రభుత్వ కళాశాలలో జరిగిన ఓటర్ల అవగాహన కార్యక్రమాలు ఆలపాటి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఓటు ఒక వజ్రాయుధమని ఓటుతోనే సమర్ధవంతమైన నాయకులను, పాలకులను ఎన్నుకోవడం సాధ్యమవుతుందని ప్రిన్సిపల్ రామచంద్రరావు అన్నారు. రోడ్డు నిబంధనలు సక్రమంగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునని కాకినాడ నగర సర్కిల్ ఇన్స్పెక్టర్ విద్యార్థులకు రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్స్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం తప్పనిసరి అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ కళాశాల లెక్చరర్లు సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వర రావు, కె.మల్లేశ్వరమ్మ, ఎం.పార్థసారథి పాల్గొన్నారు.



చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు (ఫైల్ ఫోటో)

మట్టి అక్రమ తవ్వకాల పరిశీలన


ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జి.మేడపాడు హైస్కూల్ సమీపంలోని సీతారాముడు చెరువులో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారన్న ఫిర్యాదులపై మంగళవారం ఇరిగేషన్ సిబ్బంది, విఆర్వో శ్రీనుల బృందం చెరువును పరిశీలించారు. చెరువులో మట్టిని ప్రొక్లెయినర్లతో తవ్వించి ట్రాక్టర్లలో తరలిస్తున్నారని ఫిర్యాదులు వచ్చిన సంబంధి అధికారులు రెండు రోజులుగా స్పందించలేదని ఆరోపణలు వచ్చాయి. అయితే ఈ విషయమై విఆర్ఒ శ్రీను మాట్లాడుతూ తహశీల్దారు లక్ష్మీనరసకుమారి ఆదేశాల మేరకు ఇరిగేషన్ ఐసి అసిస్టెంట్ గంగరాజు, లస్కర్ నాగుల పరిశీలించగా ఎటువంటి తవ్వకాలు జరగడం లేదని గుర్తించామన్నారు. జగనన్న కాలనీలకు మట్టి తరలించారని గుర్తించి అనుమతులు తీసుకోకుండా మట్టిని తవ్వవద్దని చెప్పామన్నారు. ఈ మేరకు తహశీల్దారుకు నివేదిక ఇచ్చినట్లు విఆర్ఒ తెలిపారు. సబంధిత ఇరిగేషన్ ఎఇ వీరబాబును వివరణ కోరేందుకు ప్రయత్నించినా ఆయన స్పందించలేదు.

కార్టూ'నిజం'



వాటన్నింటికంటే గొప్ప.. జైల్ మేట్ మరి..!!


వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కమ్యూనిటీ హాల్ కోసం వినతి

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్క్ వద్దగల డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం ప్రక్కన కమ్యూనిటీ హాల్ నిర్మించాలని పలువురు మంగళవారం హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుకు వినతి పత్రం అందజేశారు. విగ్రహం పక్కన సుమారు 22 సెంట్ల ఖాళీ స్థలంలో కమ్యూనిటీ భవనం నిర్మించాలని అంబేద్కర్ యువజన సంఘం తరఫున 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై కౌన్సిల్లో తీర్మానం చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం ప్రెసిడెంట్ రొట్టె అబ్బులు, సెక్రటరీ కానేటి చినరాజు, వైస్ ప్రెసిడెంట్ దువ్వా వెంకటేష్, చందాకుల అప్పారావు, కుక్కల తాతబాబు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిగా భైరవమూర్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్లరేవు ఇఒపిఆర్‌డిగా మల్లాడి భైరవమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ, పటవల కార్యదర్శి రమణమ్మ, పోలేకుర్రు కార్యదర్శి జ్యోతి సుధా, తాళ్లరేవు కార్యదర్శి నున్న శంకర నారాయణ, కోరంగి కార్యదర్శి రామరాజు, నీలపల్లి కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు.

నేరుగా లబ్ధిదారులకే పథకాలు

ప్రజాశక్తి-కరప

నేరుగా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం వైఎస్.జగన్‌కే దక్కుతుందని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు అన్నారు. మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా, వాకాడ గ్రామంలో ప్రతి ఇంటినీ సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఎంఎల్ఎ వెంట కురసాల సత్యనారాయణ, జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు, ఎంపిపి పెంకె శ్రీలక్ష్మీ సత్తిబాబు, గ్రామసర్పంచ్ అడబాల సత్యప్రసాద్, కె.మంగాదేవి శంకర్, బుచ్చిబాబు, చింత ఈశ్వరరావు పాల్గొన్నారు.

మత్స్యకారులపై చిన్న చూపు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

వైసిపి ప్రభుత్వం మత్స్యకారులు చిన్నచూపు చూస్తోందని టిడిపి అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ అన్నారు. మూలపేట, పొన్నాడ, కోనపాపపేటల్లో నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. మత్స్యకారుల నిమిత్తం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను టిడిపి ప్రభుత్వం నిర్మించినట్టు చెప్పారు. వైసిపి ప్రభుత్వం దాన్ని సచివాలయంగా వాడుకుంటోందన్నారు. కనీసం అధికారులు ఆలోచన లేకుండా పని చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు హయాంలో రూ.4 కోట్లతో పేద మత్స్యకారులు పెళ్ళిళ్ల కోసం, ఇతర అవసరాల నిమిత్తం ఏర్పాటు చేసిన దాన్ని అద్దెకు ఇచ్చేవర్నారు. ఈ కార్యక్రమంలో అనిసెట్టి సత్యానందరెడ్డి, మెరుగు సూరిబాబు, వాసపల్లి ఉపమాక, కంబాల రమణ, అప్పారావు, సిద్ది నాగు, కొర్ని రమణ, శ్రీను, సురాడ శ్రీను, పల్లీడి శ్రీను, మారయ్య, కోర్లయ్య, బెనుగు శివాజీ మరియు మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ప్రసన్న

ప్రజాశక్తి-కాజులూరు

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పాఠశాలకు చెందిన విద్యార్థిని ప్రసన్న ఎంపికైనట్లు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం పి.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్ర ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన ఫుట్బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినిలు పాల్గొనగా ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఎ.సాయి దుర్గ ప్రసన్న అత్యంత ప్రతిభ కనబరచి జాతీయస్థాయి ఫుట్బాల్ పోటీలకు ఎంపికైందని ఆయన తెలిపారు. జాతీయస్థాయి ఎంపికైందన్నారు. ఆమెను పిఎంసి చైర్మన్ రాధాకృష్ణ, ఎంఇఒ సత్యనారాయణ, హెచ్ఎం కృష్ణమూర్తి నాయకులు యాళ్ల సత్తిబాబు, సనానాజీ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

'భేటీ బచావో- భేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం వేడుకలను పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కరప గురజనాపల్లి హైస్కూల్లో బాలికా దినోత్సవం హెచ్ఎం బిఆర్‌వి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలన్నారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఎం.మాణిక్యాంబ మాట్లాడుతూ పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే అని తెలిపారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పి.భవాని, కె.సరస్వతి పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** ఆడపిల్లకు రక్షణ కల్పించడం మనందరి బాధ్యతని జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్ వెంకట్రావు.పేర్కొన్నారు. ఇందిరా కాలనీలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లలను రక్షించడం, లింగ నిష్పత్తి సమస్యను అధిగమించడం, బాలికలు అందరికీ విద్యా సౌకర్యం కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని 2015 జనవరి 22న ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని అన్నారు. స్థానిక సంత చెరువు వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కాకినాడ ఐడిఎ అధ్యక్షుడు డా వెదురుపాక సతీష్, కార్యదర్శి సువర్ణ రాజు, డాక్టర్ రఘురామ్, డాక్టర్ వెంకటపతి, డాక్టర్ స్వరూప్, డాక్టర్ అభిషేక్, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పాఠశాలలోని బాలికలకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. పేస్టులు, బ్రష్‌లు, మౌత్ వాష్‌లు అందచేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ పలు కార్యక్రమాలు నిర్వహించారు. సేవ్ గర్ల్ చైల్డ్ అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బాలికల వివిధ వేషధారణ అలరించాయి. వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, టీచర్లు కె.అరుణ, ఎఎల్‌వి.కుమారి, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు. **తొండంగి** మండలంలోని కొత్త పెరుమాళ్లపురంలోని సూర్య విద్యాలయం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఒంటిమామిడి పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవికుమార్ హాజరయ్యారు ఆడపిల్లలని రక్షించుకుందాం సృష్టిని కాపాడుకుందాం అనే నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం చైర్మన్ నరసింహమూర్తి, తుని మార్కెట్ యార్డ్ చైర్మన్ కొయ్యా మురళీకృష్ణ పాల్గొన్నారు.


తొండంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు



కాకినాడ రూరల్‌లో..

కొండబాబువి అవగాహన లేని ఆరోపణలు

ప్రజాశక్తి-కాకినాడ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి

మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబువి అవగాహన, అర్థం లేని ఆరోపణలని ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కొట్టిపడేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇదేమి ఖర్మ కార్యక్రమంలో కిరాయి మనుషులను పెట్టి తిరుగుతున్నారన్నారు. సామాన్యులకు ప్రభుత్వ పథకాలు సంపూర్ణంగా అందుతున్నాయన్నారు. పథకాలు పొందుతున్న వ్యక్తులే కొండబాబు వెంట తిరుగుతున్నారన్నారు. పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప రామేశ్వరం మెట్టపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. దోపిడీ ఎక్కడ జరిగిందన్నారు. గ్రావెల్‌ను కాకినాడ పట్టణంలో కొమరగిరి లే అవుట్ చొల్లంగి వద్ద 665 ఎకరాల్లో ఫిల్లింగ్‌కు వినియోగించామన్నారు. మైనింగ్ శాఖ, ప్రభుత్వ అనుమతులతోనే పనులు జరిగాయన్నారు. చినరాజప్ప దీనిపై మాట్లాడాలని కొండబాబు కాదన్నారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, పసుపులేటి వెంకట లక్ష్మి, రెహమాన్ పాల్గొన్నారు.

చట్టరీత్యా వినియోగదారులకు రక్షణ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం 1986 నుంచి చట్టం అమలులోకి వచ్చిందని వినియోగదారుల కమిషన్ మీడియేషన్ సభ్యులు, డిసిపిసి సభ్యులు కొమ్మూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రమణయ్యపేటలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డబ్బులు చెల్లించి పొందే సేవలు లేదా కొనుగోలు చేసిన వస్తువులు చికాకు పెడితే వినియోగదారుల హక్కుల కింద ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. సేవల్లో కొనుగోలు చేసిన వస్తువులలో నాణ్యత లోపించినా నష్టం కలిగినా పరిహారం పొందవచ్చు అని అన్నారు. బాధితులు న్యాయవాదిని ప్రత్యేకంగా పెట్టుకోనవసరం లేదని వినియోగదారుడే నేరుగా కేసు వేసి వాదించుకోవచ్చని అన్నారు. కొనుగోలుదారులు వస్తువులు ఎక్కడ కొన్నా నివాసం ఉంటున్న ప్రాంతం నుంచి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. వినియోగదారులు హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1967, 1800425 00 82 నెంబర్ల ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని అన్నారు. ఈ సందర్భంగా వినియోగ సమాచారం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పెండెం శ్రీదేవి, రవిశంకర్ పట్నాయక్, జిల్లా బాలల సంక్షేమ అధికారి సిహెచ్.వెంకట్రావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, పార్థసారథి, రేలంగి బాపిరాజు, డాక్టర్ శిరీష, రమేష్, రాఘవరావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సుశాంత్ ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి డి.సుశాంత్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించి ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్టు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. కేరళలో జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. సుశాంత్‌ను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డి.బ్యులా, వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జి మూర్తి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీను అభినందించారు.

స్థలం ఆక్రమించారని ఆవేదన

ప్రజాశక్తి-తాళ్లరేవు

సుమారు 30 ఏళ్ల నుంచి తాళ్లరేవు చెరువుగట్టు సెంటర్లో కొంత జాగాలో దుంపలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న తన స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించాడని ఒక వద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. మండలంలోనిపంచాయతీ చెరువుగట్టు సెంటర్లో ఉన్న ప్రధాన చెరువు గట్టుకు ఆనుకుని కుడిపూడి సూర్యకాంతం సుమారు 30 ఏళ్లుగా ఒక పాక వేసుకుని దుంపలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తోంది. ఆ స్థలంలో రాత్రికి రాత్రే ఒక వ్యక్తి గ్రావెల్ వేసి స్థలాన్ని ఆక్రమించాడని ఆమె విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. పాక నిర్మాణానికి డబ్బులు సమకూర్చుకునేంతవరకు చెరువుగట్టు సెంటర్‌లోనే స్థానికంగా అద్దెకు ఉంటూ దుంపలు అమ్ముకుంటున్నానని ఆమె తెలిపింది. తన భర్తను కోల్పోయానని, తన పిల్లలు దూరమయ్యారని తనను ఆదుకోవాలని కోరింది.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి అధికారంలోకి వచ్చిననాటి నుంచి రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి జరగడం లేదని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం మండలం ఉలిమేశ్వరంలో నిర్వహించిన 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పన్నులు పెంచడం, ధరలు పెంచడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. పెట్రోల్, గ్యాస్, విద్యుత్, ఆర్‌టిసి ఛార్జీలతో పాటు నిత్యవసర సరుకుల ధరలన్నీ విపరీతంగా పెంచారన్నారు. ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు, ఎలిశెట్టి నాని, పేకేటి దొరబాబు, మొయిళ్ళ కృష్ణమూర్తి, తుమ్మల నాని, కంటి బోయిన వెంకటేశ్వరరావు, బుజ్జి, ఎగ్గాడ శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, చాగంటి గోపాలకృష్ణ, పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రమణ

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

74వ గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో పోలీసు కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆర్‌డిఒ బి.వి.రమణ మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్న నేపథ్యంలో గ్యాలరీల అలంకరణ, స్టాల్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపిడిఒ సత్యనారాయణ, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, మున్సిపల్ ఎస్ఇ సత్యకుమారి, అర్బన్ తహశీల్దార్ సీతాపతిరావు, రూరల్ తహశీల్దార్ మురార్జీ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

ప్రజాశక్తి- పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈనెల 26 నుండి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ బ్యానర్లు, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగాన్ని పూర్తిగా నిషేధం అమలు జరుపుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 120 మైక్రాన్ల లోపు మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులు, ఉపయోగించినా, అమ్మినా, నిల్వ చేసినా ఈ సరుకుల ఉత్పత్తి సంస్థలకు రూ.50 వేలు నుండి రూ లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు.


నాణేలను పరిశీలిస్తున్న విద్యార్థులు

పురాతన నాణేల ప్రదర్శన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సంస్కారభారతి ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక మధురానగర్‌లోని ప్రజా విద్యాలయంలో మంగళవారం పురాతన నాణేలు, కరెన్సీ నోట్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ సుమారు 300 సంవత్సరాల నుంచి 1947 వరకు చలామణీలో ఉన్న దేశవిదేశాల నాణేలు, నోట్లు ప్రదర్శనలో ఉంచారు. దీనితోపాటుగా సంస్కారభారతి తరపున గణతంత్ర వేడుకలలో భాగంగా పాఠశాల విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన, దేశభక్తుల చిత్రలేఖన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు ఆకొండి పవన్ కుమార్, ఆకొండి ఉష, ఆకొండి సూర్య, మహమ్మద్ హుస్సేన్, కరస్పాండెంట్ వక్కలంక రామకష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు హుండీల ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయంలో హుండీలను బుధవారం లెక్కించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించిన అధికారుల సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు. పోలీసులు, ప్రజల సమక్షంలో లెక్కింపు జరుగుతోందన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ చంటిబాబు

ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన

ప్రజాశక్తి-గండేపల్లి

వైసిపి పాలనలో ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు. మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండో రోజు గండేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ సంక్షేమం పథకాలు ప్రజలందరికీ పూర్తిగా అందాలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగుతోందన్నారు. ఎవరికైనా సాంకేతిక లోపం వల్ల ఇబ్బంది పడుతుంటే ఈ గడపగడపకు కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి అధికారులతో తక్షణమే పరిష్కారం అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొరబాబు, జాస్తి వసంత్, ఒబిన్ని వీరబాబు, తాళ్లూరి మధు కుమార్, దొమ్మ శ్రీను పాల్గొన్నారు.



రహదారి నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి-పిఠాపురం

అందరూ నియమ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణాలు చేయాని డిఎస్‌పి పి.మురళీకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో సిఐ వైఎస్ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా మూడు మండలాలకు సంబంధించిన ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లతో, అసోసియేషన్ సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి మాట్లాడారు. వ్యక్తిగత తప్పిదాల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, అవసరమైన మేరకే ఛార్జీలు వసూలు చేస్తూ తక్కువ మందితో ప్రయాణాలు సురక్షితంగా చేయాలన్నారు. ఆటో డ్రైవర్లు ముందు భాగములో ప్రయాణికులను కూర్చోబెట్టుకోవద్దని హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్ ఫోన్ ఉపయోగించకూడదన్నారు. నియమాలను అతిక్రమిస్తే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కేసుల నమోదుతో పాటు ఫైన్ వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణ, రూరల్, గొల్లప్రోలు, కొత్తపల్లి ఎస్ఐలు, ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లు టాక్సీ డ్రైవర్లు అసోసియేషన్ల సభ్యులుతదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడులో రైతు భరోసా కేంద్రంలో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో అనేక చోట్ల తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. రైతు భరోసా కేంద్రంలో కియోస్క్ మెషిన్ పనితీరును, ఇ క్రాప్ నమోదును, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖల ద్వారా రైతులకు అమలవుతున్న పథకాల అమలు తీరును పరిశీలించినట్టు చెప్పారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి పి.ముత్యాలనాయుడు, కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు సత్యకిషోర్, శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, తహశీల్దారు విజయ్ కుమార్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధరల బాదుడుకు బ్రేకుల్లేవు..

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్రంలో ధరల బాదుడుకు బ్రేకుల్లేవని టిడిపి రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన అధ్యక్షులు వేమూరి ఆనంద సూర్య విమర్శించారు. వైసిపి దుర్మార్గపు పాలనలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి ఇదేమి ఖర్మ మన కాకినాడకు కార్యక్రమంలో భాగంగా 23వ డివిజన్‌లో నిర్వహించిన కార్యమంలో మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబుతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెండ్యాల భవాని మల్లిపూడి వీరు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస, హోతా రవికుమార్, గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, గుత్తుల రమణ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్ఐసి ఏజెంట్స్ ప్రొటెక్షన్ డే

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో ఏజెంట్స్ ప్రొఫెషన్ ప్రొటెక్షన్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజమండ్రి డివిజన్ కౌన్సిల్ అధ్యక్షులు రావుల మాధవరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఏజెంట్లకు పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ ఏజెంట్ దంగేటి సూర్యనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రావుల మాధవరావు మాట్లాడుతూ ఏజెంట్ల ఐక్యత కోసం అందరూ కలిసికట్టుగా ఉండాలని, ఏజెంట్లు సమస్యలు తీర్చేందుకు అసోసియేషన్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం బ్రాంచ్ కార్యదర్శి లోకారెడ్డి రామకష్ణ, చెల్లూరు ప్రసాద్, బిఎస్.ప్రకాష్‌రావు, పుడతా రామచంద్రరావు, పండు రాఘవులు, కెవి.సత్యనారాయణ, కేశనకుర్తి శేఖర్, ఆనాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆదిత్యలో జెఇఇ మెయిన్స్ పరీక్షలు

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జెఇఇ మెయిన్స్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, టెస్ట్ సెంటర్ అడ్మిన్‌గా ప్రొఫెసర్ ఎం.రాజబాబు వ్యవహరిస్తున్నారు. ఈ రోజు పరీక్షకు 115 మందికి గాను ఒక గైర్హాజర్ అయ్యారని రాజబాబు తెలిపారు. జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు దేశవ్యాప్తంగా నిర్వహించే జెఇఇ మెయిన్ తొలివిడత పరీక్షలు మంగళవారం ఉదయం ప్రారంభం అయ్యాయి.

వైద్య సిబ్బందికి అవార్డుల అందజేత

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి, ఏలేశ్వరం

ఉత్తమ సేవలందించిన వైద్య సిబ్బందికి కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం అవార్డులు అందజేశారు. కొత్తపల్లి పిహెచ్‌సిలో ఆశ వర్కర్ ఎం.జ్యోతికి కలెక్టర్ అవార్డు పొందిన జ్యోతిని కొత్తపల్లి వైద్యులు, సిబ్బంది అభినందించారు ఏలేశ్వరం అర్బన్ పిహెచ్‌సి ఎఎన్ఎం మర్రి చిన్నమ్ములుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. బాలిక శిశు సంరక్షణ, గర్భస్థ పిండ నిర్ధారణ చట్టంపై అవగాహన వంటి సేవలకు గాను ఈ అవార్డుకు అధికారులు చిన్నమ్ములను ఎంపిక చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా ద్వారా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. అవార్డును అందించిన వారిలో డిఎం అండ్ హెచ్‌ఒ డాక్టర్ శాంతి ప్రభ, ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ పద్మ శశిధర్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పి సరిత ఉన్నారు. ఆమెను ఏలేశ్వరం వైద్యాధికారి భాస్కరరావు, సిహెచ్‌ఒ మాణిక్య కుమారి, ఎస్‌వి.రమణ, శివరత్నం, ఎఎన్ఎంలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం

డాక్టర్‌బిఆర్.అంబేద్కర్‌కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మంగళవారం జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనలకు సంబంధించిన పోలీసులు తెలిపిన వివరాలు ఇవి..

ఫిట్స్ రావడంతో..

కపిలేశ్వరపురం కపిలేశ్వరపురం మండలంలోని మాచర-టేకి మార్గ మధ్యలో మంగళవారం ఫిట్స్ రావడంతో సైక్లిస్ట్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ఇవి.. అంగరకు చెందిన గుత్తుల శ్రీనివాస్ మంగళవారం ఉదయం తన అత్తావారి ఊరైన మాచర నుంచి అంగరకు సైకిల్‌పై వస్తున్నాడు. టేకి శివారులోని రేకుల చావిడి వద్దకు చేరుకున్నాక ఉన్నట్టుండి ఫిట్స్ వచ్చాయి. పక్కనే ఉన్న పంట పొలంలో పడి మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని..

ఏలేశ్వరంప్రత్తిపాడు మండలం జాతీయ రహదారిపై పాదాలమ్మ గుడి వద్ద డివైడర్ను ఢీ కొట్టి బాలుడు మతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ప్రతిపాడు ఎస్ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామానికి చెందిన మూరా కిషోర్ ద్విచక్ర వాహనంపై ప్రత్తిపాడు మండలం ధర్మవరం వివాహానికి వెళ్లి తిరిగి వస్తుండగా డివైడర్ను ఢీ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రతిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

క్రేన్ టైర్ల కింద పడి

జగ్గంపేట క్రేన్ టైర్ల కింద పడి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. జగ్గంపేట ఎఎస్ఐ నూకరాజు తెలిపిన వివరాలు ఇవి.. గండేపల్లి మండలం తాళ్లూరుకు చెందిన సిద్ధబత్తుల అబ్బులు(42) ఎటిఎంలో డబ్బులు తీసుకునేందుకు జగ్గంపేట వెళ్లాడు. డబ్బులు తీసుకుని బైకుపై వస్తుండగా జగ్గంపేటలోని విక్టరీ బజార్ వద్ద క్రేన్ టైర్ల కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెద్దాపురం ఆసుపత్రికి తరలించారు.

ఐసిడిఎస్ ఉద్యోగులపై దాడికి ఖండన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

అన్నమయ్య జిల్లాలో ఐసిడిఎస్ ఉద్యోగులపై వైసిపి నాయకులు దాడిని ఖండిస్తూ ముమ్మిడివరం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట మంగళవారం ఐసిడిఎస్ ఉద్యోగులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని ఐసిడిఎస్ సాధికారత అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎఎస్.యువరాజు, వివేకానంద, తౌహీద్ బాషాలపై రాయచోటి ఎమ్ఎల్ఎ అనుచరులు దాడిని ఐసిడిఎస్ ఉద్యోగుల సంఘం ఖండించింది. ముమ్మిడివరం ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. దాడికి పాల్పడ్డ వైసిపి కన్వీనర్ పోలు సుబ్బారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, అతని అనుచరులపై పోలీసులు క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి. సుబ్బారాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ముమ్మిడివరం పర్యవేక్షకులు కెవివిఎస్‌టి.కుమారి, ఎం.విజయ గౌరీ, సిహెచ్.పల్లవి, జివిఎస్ఎన్.దేవి, జె.మీనాక్షి, ఎల్‌వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రస్తుతం స్థానిక మండల తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.లక్ష్మీపతి ఉద్యోగోన్నతి పై పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో దీంతో ప్రభుత్వం ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు కొత్తపేట మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జిడి.కిషోర్‌బాబును ఇన్‌ఛార్జి తహశీలార్‌గా నియమించడంతో మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యలలో భాగంగా రెవెన్యూ పరిధిలో ఉండే ప్రతి సమస్యను ఉన్నతాధికారులు, క్రింది స్థాయి ఉద్యోగుల సహాయ సహకారాలతో సత్వరమే పరిష్కరించేందుకు కషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బందితో పాటు ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాస్, గుణ్ణం రాంబాబు, సొసైటీ చైర్మన్ నెక్కంటి బుజ్జి తదితరులు అభినందనలు తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని అమలాపురం తాలూకా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎ.పరదేశి, సిబ్బంది, ఎస్ఇబి అమలాపురం సిఐ తో కలసి మంగళవారం బట్లపాలెం బివిసి కాలేజ్ నందు డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి పరదేశి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా యువత మేలుకో- భవితను మలుచుకో- డ్రగ్స్ ను వదులుకో అంటూ డ్రగ్స్ రహిత సమాజం సంక్షేమానికి సంకేతం అన్నారు.

కుండలేశ్వరంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-కాట్రేనికోన

కుండలేశ్వరంలో మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షులు నడింపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నాగిడి నాగేశ్వర రావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన కొనసాగుతోందని ఆరోపించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, బిసి సెల్ జిల్లా అధికార ప్రతినిధి విత్తనాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్ష శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తపేట

విశాఖ ఉక్కు పరిశ్రమ ఉద్యమానికి మద్దతిస్తూ సిపిఐ, ఎఐటియుసి రాష్ట్రవ్యాప్త రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల వద్ద నిరసనలో భాగంగా కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ముందు నిరాహార దీక్షా శిబిరం నిర్వహించారు. మంగళవారం ఈ శిబిరాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా ఇంచార్జ్ దేగ ప్రభాకర్ ప్రారంభించారు. దీక్షల సిపిఐ కొత్తపేట నియోజకవర్గ వర్గ కన్వీనర్ కె.రామకృష్ణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, నియోజకవర్గ కన్వీనింగ్ కమిటీ సభ్యులుజె.ఏసురాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పేర్కొన్నారు.

వెంకాయమ్మ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అమలాపురం రూరల్


పరామర్శిస్తున్న దళిత నాయకులు

తాండ పల్లికి చెందిన సిపిఎం నాయకురాలు గుత్తాల వెంకయమ్మ కుటుంబ సభ్యులను దళిత నాయ కులు మంగళవారం పరా మర్శించారు. వెంకాయమ్మ అనారోగ్యంతో ఇటీవల మరణించిన విషయం విదితమే. పలువురు మాట్లాడుతూ వెంకాయమ్మ 3 దశాబ్దాల నుంచి వ్యవసాయ రైతు కూలీ సంఘం నాయకురాలుగా కూలీల సమస్యల పైన పలు ఉద్యమాలు చేపట్టారని అన్నారు. తాండవపల్లి చింతలపూడి, గుడాల, రోళ్లపాలెం తదితర గ్రామాల్లో కూలీ ఉద్యమాలు చేపట్టారని వెంకాయమ్మ సేవలను గుర్తు చేసుకున్నారు. ఆమె మృతి పట్ల దళిత నాయకులు మెండు రమేష్ బాబు, పరమట శరత్ బాబు,బొంతు రవికుమార్, కైరం సత్తిబాబు,కుంటే రాము తదితరులు సంతాపం తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -కాట్రేనికోన

మండల పరిధిలోని చెయ్యేరు గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పీడీ ఎస్.మధుసూదన్ పరిశీలించారు. చెయ్యేరు గ్రామంలో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. ఉపాధిహామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట కాలువ పనులను జరిగే తీరును పరిశీలించారు. పనులను పరిశీలించి మస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎపిఒ ఎస్.శ్యామ్ రాజ్, క్షేత్ర సహాయకులు, టిఎలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ యాప్‌పై సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

స్త్రీ శక్తి భవనంలో ఎంజిఎన్‌ఆర్ఇజిఎస్ సిబ్బందికి ఎన్ఎంఎంఎస్ యాప్ వినియోగంపై ఎపిడి సత్యనారాయణ, ఎంపిడిఒ జాన్ లింకన్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఇంతవరకు జరిగిన, జరగబోయే పనులపై సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. వారు మాట్లాడుతూ ఉపాధి జాబ్ కార్డ్ కలిగిన వారందరికీ తప్పకుండా ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇంచార్జ్ ఎపిఒ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్ ఇంచార్జ్ జెఇ కామత్ రామచంద్రరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి మెట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తపేట

గ్రంథాలయాల వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి విఎల్ఎన్.సాయి వరప్రసాద్ రికార్డులను పరిశీలన చేశారు. ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి పి.వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిథిలావస్థకు చేరిన లైబ్రరీకి భవనం నిర్మించాలని, కోనసీమ అభివృద్ధి సాధన సమితి, రోటరీ క్లబ్ సభ్యులు కోరారు. పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.దీనిపై జిల్లా గ్రంథాలయాల కార్యదర్శి స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల గౌరవ అధ్యక్షుడు గట్టి రామారావు, సలహాదారు చామకూర నాగేశ్వరరావు, కోనసీమ అభివృద్ధి సాధన సమితి సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -కొత్తపేట

స్థానిక మండల పరిషత్ నందు కొత్తపేట మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లోని టెన్త్ క్లాస్ విద్యార్థులకు జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్స్‌ను జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి ప్రవీణ్ కుమార్, మండల అధ్యక్షుడు మార్గాన గంగాధర్ అందజేశారు. జెడ్‌పి నిధుల ద్వారా జగనన్న విద్యా భారతి మెటీరియల్స్‌ను అందజేసిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ రావుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. **అమలాపురం రూరల్** సమనస మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాల్లో ప్రిన్సిపల్ వైటిఎస్.రాజు అధ్యక్షతన టెన్త్ విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్ సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్, మండల కో ఆప్షన్ సభ్యుడు మొసలి స్పర్జన్ రాజు, ఎంపిటిసి సభ్యుడు ఉడుము రామకృష్ణ ల అందజేశారు. **ఉప్పలగుప్తం** గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం ఎల్.రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్టడీ మెటీరియల్‌ను టెన్త్ విద్యార్థులకు జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు కోరారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, పిఎంసి చైర్మన్ దోనిపాటి రమా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మునిపల్లి, ఎన్.కొత్తపల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రతి ఏటా జనవరి 25న జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవానికి మండల కేంద్రంలోని జాస్తి వారి కల్యాణ మండపం ఆవరణంలో స్థానిక బిఎల్ఒలైన కార్యదర్శి కె.సంజీవరెడ్డి, విఆర్ఒలు వెంకట్, ప్రసాద్ ల ఆధ్వర్యంలో విద్యార్థి నులకు ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా సమర్థులైన పాలకులను ఎన్నుకుని వ్యవస్థ పరిరక్షణకు తోడ్పడాలన్నారు. పోటీలలో విజేతలకు ఓటర్ల దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతి లావణ్య , ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.